క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కందుకూరు: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే సబితారెడ్డి పంపిణీ చేయనున్నామని తహసీల్దార్ గోపాల్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలేష్‌చారి

బడంగ్‌పేట్: ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌ను.. బీసీసెల్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు ఈశ్వరోజు బాలేష్‌చారి బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ సభ్యులు

షాద్‌నగర్: స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సర్వ వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడిగా చీపిరి చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా నర్సింలు, లైబ్రేరియన్‌గా రమేశ్, కోశాధికారిగా లింగం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా రహీముద్దీన్, సభ్యులుగా శ్రీశైలం, విజయ్‌కుమార్, విజయ్‌భాస్కర్, శ్రీనివాస్, రూప్‌సింగ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పలువురు న్యాయవాదులు నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సత్కరించారు.

వైద్య విద్యతో గుర్తింపు



మొదటి బ్యాచ్ విద్యార్థులతో మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: వైద్య విద్యతో విద్యార్థులు మంచి గుర్తింపు పొందాలని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలలో 2019 మొదటి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం, ఫ్రీ కాన్వకేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్యకళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, డీన్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ జోయారాణి, మెడికల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి ఉన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

షాద్‌నగర్: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై గురువారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్థసారథి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతున్నట్లు చెప్పారు.

గురుకుల పాఠశాల తనిఖీ

మంచాల: రంగాపూర్ మినీ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలను ఎంపీడీఓ బాలశంకర్ బుధవారం తనిఖీ చేశారు. భోజనం, తాగునీటి, పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. వసతిగృహం పరిసరాలు, మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మరో రెండు తరగతి గదులు మంజూరు అయ్యాయని, స్థల పరిశీలన చేసి నిర్మాణ పనులు చేపడతామన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మంచాల: ఆరోగ్య సమస్యలతో రేషన్ డీలర్ నల్లనాగుల కరుణాకర్‌రెడ్డి(68) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బుధవారం నోముల గ్రామంలో ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాజీవ్ 'యువ వికాసం'

- పథకానికి విశేష స్పందన
- వెల్లువలా దరఖాస్తులు
- 14తో ముగిసిన గడువు

తుక్కుగూడ/బడంగ్‌పేట్: యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వెల్లువలా దరఖాస్తులు వచ్చాయి. వ్యవసాయేతర పథకాలకు 21- 55 సంవత్సరాల వయస్సు, వ్యవసాయ ఆధారితక 21- 60 ఏళ్లు కలిగిన వారు పథకానికి అర్హులు కావడంతో.. ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.

248 దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకానికి తుక్కుగూడ పురపాలిక పరిధి రావిర్యాల, ఇమామ్‌గూడ, తుక్కుగూడ, సర్దార్‌నగర్, మంఖాల్, దేవేందర్‌నగర్ కాలనీ, హర్షగూడ తదితర గ్రామాల నుంచి అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. పథకానికి తొలుత ఈ నెల 4వ తేది చివరి గడువుగా పేర్కొన్నప్పటికీ.. తర్వాత 14వ తేదీకి ప్రభుత్వం పొడగించింది. పథకం గురించి మున్సిపల్ అధికారులు.. వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో విస్తృతంగా ప్రచారం చేయించారు. గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణ ప్రజలు పుర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా తుక్కుగూడ పుర కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కూడా.. హార్డ్‌కాపీని కార్యాలయంలో



పుర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్(ఫైల్)

అందజేశారు. గడువు ముగిసే సరికి మున్సిపాలిటీలో 245 ఆన్‌లైన్‌లో, మరో 3 దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో అందాయి.

బడంగ్‌పేట్‌లో.. నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'రాజీవ్ యువ వికాస్' పథకానికి బడంగ్‌పేట మున్సిపాలిటీలో ఎస్సీలు 150, ఎస్టీలు 48, బీసీలు 338, ఈబీసీలు 39, మైనార్టీలు 14, క్రిస్టియన్లు 2 దరఖాస్తు చేసుకున్నారని పుర అధికారులు తెలిపారు. ప్రతి ధరఖాస్తును పరిశీలించి, బ్యాంకులతో అనుసంధానం చేసి, ప్రభుత్వ కల్పించే రాయితీ రుణాన్ని అందచేస్తామని పేర్కొన్నారు. దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా బలపడాలని సూచించారు. కాగా.. ఎలాంటి పైరవీలకు తావులేకుండా నిజమైన అర్హులను గుర్తించి, న్యాయం చేయాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు.

వర్గాల వారీగా దరఖాస్తులు (ఆన్‌లైన్)	
ఎస్సీ	87
ఎస్టీ	11
బీసీ	44
ఈబీసీ	01
మైనార్టీ	09
శాలివాహన సొసైటీ	08
నాయి బ్రాహ్మణ ॥	05
ఉప్పర (సాగర) ॥	08
గీతా కార్మికుల ॥	26
వాషర్ మెన్ ॥	31
విశ్వబ్రాహ్మణ ॥	15

మోసపోవద్దు



దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది. త్వరలో వెరిఫికేషన్ మొదలు పెడతాం. అర్హులను గుర్తించిన అనంతరం వారికి ప్రభుత్వం రాయితీతో కూడిన రుణం ఇస్తుంది. దాంతో పాటే బ్యాంకులు రుణాలు అందజేస్తాయి. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. రుణాలు ఇప్పిస్తామని వచ్చే దళారులను నమ్మి మోసపోవద్దు.

– సరస్వతి, కమిషనర్, బడంగ్‌పేట్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



దాసర్లపల్లిలో మహనీయుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కలిసిరావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మండల పరిధి దాసర్లపల్లి, దాసర్లపల్లితండా, సాయిరెడ్డి గూడల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలగర్భంలో కలిపే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, దానిని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కె.యుగంధర్‌గౌడ్, ఏ.సురేందర్, పుష్పదర్శన్, పార్టీ సీనియర్ నాయకులు కె.రాజాప్రతాప్‌రెడ్డి, ఎస్.పాండు, కె.వెంకటేశ్, ఎస్.వెంకటేశ్ గౌడ్, శారద, శేఖర్, సులేమాన్, ఎస్.అజీజ్, ఎన్.యాదయ్య, బాలరాజ్, పాండురంగారెడ్డి, శేఖర్‌గౌడ్, సంజీవరెడ్డి, లింగమయ్య, పి.శ్రీరాములు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మహేశ్వరం: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి నాగార్జున సూచించారు. బుధవారం మండల పరిధి మహేశ్వరం, రాంకీ విల్లాస్‌లో జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమకు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు చేపడుదాం, దేశ సంపదను



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది

కాపాడుదాం అనే నినాదంతో వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో పూజలు

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని గణేశ్ దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి మున్సిపల్ మాజీ చైర్మన్ హాజరయ్యారు. ఆధ్యాత్మిక చింతనను అవలంబించుకుంటే ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. నాయకులు యుగేందర్, నందకిషోర్, అంతయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాల అభివృద్ధి



సుభాన్‌పూర్‌లో జై సంవిధాన్ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య

మహేశ్వరం: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధి సుభాన్‌పూర్, దిలావార్‌గూడ, అయ్యవారిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయాలు, రాజ్యాంగం పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ, రాజ్యాంగాన్ని కించపరిచేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణకు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఆవుల యాదయ్య, రైతుబంధు కమిటీ మండల మాజీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ఎస్టీసెల్ మండల మాజీ అధ్యక్షుడు సేనావత్ రాజు నాయక్, కోళ్లపడకల్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు హరికిషన్ గౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్య, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, పాండు నాయక్, మంత్రి బాలరాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లూరు రాజు, ప్రవీణ్, లాజర్, వెంకటయ్య, హన్మంత్‌రెడ్డి, పాండు ముదిరాజ్, పాపయ్య, శేఖర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ సూచించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం వార్డు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్యపై ఫిర్యాదు వస్తే 24 గంటల్లో సమస్య పరిష్కరించాలన్నారు. పైప్ లైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలని, బోరుమోటార్లు రిపేర్‌లు ఉన్నా వెంటనే చేయించాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు జమీర్ అహ్మద్, వెంకటేష్, సుదర్శన్, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

ఇంటర్ బోర్డు కమిషనర్‌కు మొగిలిగిద్దవాసుల వినతి

షాద్‌నగర్: ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామస్తులు ఇంటర్ బోర్డు కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్యను కోరారు. ఈ మేరకు స్థానికులు శ్యాంసుందర్, ర్యాకల మల్లేశ్, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తదితరులు ఇంటర్ బోర్డు కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య, ఆర్‌జేడీ జయప్రద బాయిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. 25 ఏళ్లుగా గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతుందని, ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుందని



ఇంటర్ బోర్డు కమిషనర్‌ను కలిసిన గ్రామస్తులు

పేర్కొన్నారు. కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని, వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్‌ను గ్రామస్తులు సత్కరించిన జ్ఞాపికను అందజేశారు.

చిరు ధాన్యాలతోనే ఆరోగ్యం పదిలం

ఐసీడీఎస్ సీడీపీఓ షభానా

నందిగామ: చిరుధాన్యాలలోనే పోషకాలు అధికంగా ఉంటాయని, వాటిని బాలింతలు, గర్భిణులు తప్పకుండా ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ షభానా సూచించారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ షభానా మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిరుధాన్యాలు, వాటి ప్రాముఖ్యత, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభిస్తాయని అన్నారు. చిన్నారులకు 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని, అవే అమృతంలాగా పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, మెడికల్ ఆఫీసర్ ప్రవంతి, అంగన్ వాడీ టీచర్లు ఉమ, మల్లమ్మ, నిర్మల, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే..

షాద్‌నగర్: పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా బుధవారం మండల పరిధిలోని దూసకల్ ఆరోగ్య ఉప కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. తద్వార శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య ఉప కేంద్రం డాక్టర్ శ్వేత, ఏఎన్‌ఎం గౌసియా, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అమృత, ఆశవర్కర్లు యాదమ్మ, జ్యోతి, ఆయాలు పార్వతమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ షభానా



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

మహేశ్వరం: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. పాతికేళ్ల అనంతరం కలుసుకున్న బాల్యమిత్రులు.. ఒకే వేదికగా సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. మామిడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు.. బుధవారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, సుధాకర్ రెడ్డి, శిరీష, నాగమణిలను ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గొండ్యాల రాజశేఖర్, చిన్న శేఖర్, రామరాజు, రాధిక, స్వప్న, సంపూర్ణ, మల్లేశ్, ప్రతాప్, జగన్, నిర్మల, రాజమణి, సునీత, చంద్రమౌళి, చంద్రశేఖర్ రెడ్డి, స్వామి, తన్వీర్, కృష్ణ, శ్రీశైలం, మధు, శంకర్‌లు పేర్కొన్నారు.

ఉపాధి సరే.. వేతనం ఏది?

- మూణ్నెళ్లుగా అందని డబ్బులు
- ఇబ్బందుల్లో ఉద్యోగులు, కూలీలు

మంచాల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పేద ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు.. వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయి. పని కల్పించినప్పటికీ.. మూణ్నెళ్లుగా వేతనం చెల్లించపోవడంతో కూలీలు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. పస్తులుండాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నారు.

మండలంలో 1,220 మంది కూలీలు

మంచాల మండలం పూర్తిగా కరువు ప్రాంతం. గుట్టలతో కూడిన పోడు భూములు ఉన్నాయి. ఇక్కడ పెద్దగా నీటిపారుదల ప్రాజెక్టులు, కాల్వలు లేవు. చిన్నచిన్న కమతాలు, వర్షాధార పంటలు మాత్రమే పండిస్తారు. నూటికి 80 శాతం ప్రజలు 'ఉపాధి' పథకం కింద పనులు చేసుకొని జీవిస్తున్నారు. మండల పరిధి 23 గ్రామాల్లో 1,220 మందికి పైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వేసవిలో ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే పని చేయాలి. పని చేసే చోట టెంట్లు ఏర్పాటు చేయాలి. తాగు నీటి వసతి కల్పించాలి. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలి. ప్రస్తుతం ఇవేమీ ఇవ్వడం లేదు. గతంలో కూలీలకు 5 కిలో మీటర్ల దూరం వెళ్లి పని చేస్తే, రవాణా ఖర్చులు, గడ్డపారలు, మట్టి ఎత్తడానికి తట్టలు, తాగు నీటికి అదనంగా రూ.5 చెల్లించే వారు. పని చేసే చోట టెంట్లు ఏర్పాటు చేసేవారు. కానీ నేడు అవేవి లేవు.

చేసేవారికి.. చేయించే వారికి..

గడిచిన మూడు నెలలుగా కూలీలు, ఏపీఓలకు వేతనాలు రావడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇవ్వటం లేదు. 1220 మంది కూలీలకు రూ.10 లక్షల 80 వేలకు పైగా, అదే విధంగా 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.2 లక్షలకు పైగా రావాల్సి ఉంది. పనిచేసే వారికి, చేయించే వారికి జీతాలు రాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితని వాపోతున్నారు. పని చేసే చోట ఫోన్ సిగ్నల్ లేక, సర్వర్ మొరాయింపుతో కొన్ని సార్లు హాజరు కావడం లేదని కూలీలు పేర్కొంటున్నారు.



ఆరుట్ల అడవిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పని చేసి పస్తులు..


యాచారం: కూలీ డబ్బులు అందక ఉపాధి కూలీలు పస్తులు ఉంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య ఆవేదన వ్యక్తంచేశారు. మండల పరిధి తమ్మలోనిగూడ గ్రామంలో బుధవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడగా.. కూలీ డబ్బులు రావడం లేదని, పని చేసి పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం అంజయ్య మాట్లాడుతూ.. ఐదు వారాలుగా కూలీలకు డబ్బులు రావడం లేదని తెలిపారు. వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు మెసేజ్‌లు వస్తున్నాయని, కానీ బ్యాంకుల్లో డబ్బులు



కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

ఉండడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వారం, వారం డబ్బులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఫలితం లేదు



మండుతున్న ఎండలతో ఫాంపాడ్స్ గోతులు తీయడం ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం ల్యాండ్ లేవలింగ్, కందకాలు తీయడం వంటి పనులు చేయించాలి. ఐదు కిలో మీటర్ల దూరం అడవిలోకి వచ్చి పనులు చేస్తున్నాం. కాని పనికి తగిన ఫలితం రావడం లేదు.

-చెరుకు మంజుల, కూలీ, ఆరుట్ల


రైతులకు మేలు జరిగేలా..



ఉపాధిహామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు చేయించాలి. దీంతో కూలీలతో పాటు రైతులకు మేలు జరుగుతుంది. మట్టి రోడ్డు నిర్మాణం వంటి పనులు చేయించాలి. అడవుల్లో పనులు చేయించడం ప్రయోజనం ఉండదు. అక్కడ పనిచేయడం కష్టంగా ఉంది.

– చిందం మల్లేశ్, కూలీ, ఆరుట్ల

డబ్బులు వస్తాయి



ఉపాధిహామి పథకం కింద పని చేసిన కూలీలకు రికార్డు ప్రకారం కూలీ డబ్బులు వస్తాయి. కొంత ఆలస్యం అవుతున్నది వాస్తవమే. ఎవరూ ఇబ్బంది పడొద్దు. కొలతల ప్రకారం పని చేస్తే దినసరి కూలి పడుతుంది.

-కె.వీరాంజనేయులు, ఏపీఓ, మంచాల